# కేవీపీ ఆస్తులపై విచారణ జరపాలి

- ఇలాంటి వ్యక్తి ప్రపంచంలో ఎక్కడా లేరు
- సక్రమంగా భూపంపిణీ చేపట్టాలి: తెదేపా

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** కేవీపీ రామచంద్రరావును ప్రజాభద్రత, రక్షణ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించి, ఆయన కుటుంబ ఆస్తులపై న్యాయవిచారణ జరిపించాలని తెదేపా డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవీపీపై వచ్చినన్ని ఆరోపణలు ఎవరిపైనా రాలేదని, దేశం మొత్తం మీద ఇలాంటి వ్యక్తి ఎక్కడా లేరని పేర్కొంది. ఆయన శరీరంలో సోడియం నిల్వలు తక్కువగా ఉన్నాయా? అని అనుమానం వ్యక్తం చేసింది. సోడియం నిల్వలు తక్కువగా ఉంటే ఏ విషయమైనా మెదడుకు చేరదని, ఆలోచన ఉండదని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేసిన భూ పంపకమంతా బూటకమని దుయ్యబట్టింది. తెదేపా నేతలు వర్ల రామయ్య, డేవిడ్‌రాజు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రోశయ్య గతంలో ఓ సందర్భంలో.. 'కేవీపీయా! సలహాదారా?.. చూసి చెప్తా' అని అన్నారని, అదే మాట తనను ఎవరైనా అని అంటే.. తక్షణమే పదవిని వదిలేసి ఉండేవాడినని వర్ల రామయ్య పేర్కొన్నారు. కేవీపీ శరీరంలో ఏదో లోపం ఉందని, ఆయనలో చలనం కలగడం లేదని అన్నారు. . కేవీపీ అవినీతిపై చర్చకు తమ పార్టీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విసిరిన సవాలును స్వీకరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఆరు లక్షల ఎకరాల భూమి పంచామని ఘనంగా చెప్పుకుంటున్న సర్కారు లెక్కలన్నీ కాగితాలకే పరిమితమని డేవిడ్‌రాజు విమర్శించారు.

**చిట్టా విప్పుతాం... సోమిరెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీపీ రామచంద్రరావును ఆ పదవి నుంచి తప్పించి.. ఆయన ఆస్తిపాస్తులు, అవినీతి వ్యవహారంపై ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించకపోతే ప్రతి నాలుగు రోజులకు ఒకసారి కేవీపీ బాగోతాల చిట్టా విప్పుతామని నెల్లూరు జిల్లా తెదేపా కన్వీనరు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరులో స్పష్టం చేశారు. సమైక్యాంధ్ర జేఏసీ నేతలు పాదయాత్ర చేస్తూ హైదరాబాదుకు వచ్చి గవర్నర్‌ను కలవడానికి వీలు లేదని హెచ్చరికలు చేయడం తెలంగాణ నేత దామోదర్‌రెడ్డికి న్యాయం కాదని సోమిరెడ్డి అన్నారు. ఉద్యమాలు చేసే హక్కు అందరికీ ఉందని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబునాయుడిపై సినీనటి జయప్రద చేసిన వ్యాఖ్యలను సోమిరెడ్డి ఖండించారు. రెండోసారి రాజ్యసభ పదవి ఇవ్వలేదని పార్టీ నుంచి వెళ్లిపోయారని విమర్శించారు.